పటేల్ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద ఆప్ కార్యకర్తల ఆందోళన

మోదీ ఇంటి ముట్టడికి యత్నం

- ఢిల్లీలో ఆప్ నిరసనలపై పోలీసుల ఉక్కుపాదం
- ప్రధాని మోదీ ఇంటి సమీపంలో 144 సెక్షన్
- నిష్పక్షపాత దర్యాప్తునకు అమెరికా సూచన

న్యూఢిల్లీ, మార్చి 26: ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఆప్ శ్రేణులు మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించాయి. అయితే పోలీసులు వారిపై ఉక్కుపాదం మోపారు. ప్రధాని నివాసం వైపుగా ఆప్ కార్యకర్తలు రాకుండా అన్ని మార్గాలను అష్టదిగ్బంధం చేశారు. ఆప్ ఆందోళన నేపథ్యంలో ముందుగానే ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు.. లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని మోదీ నివాసం వద్ద పెద్దయెత్తున బలగాలను మోహరించారు. ప్రధాని ఇంటికి వెళ్లే అన్ని మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ ఇంటి చుట్టు పక్కల ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. పోలీసుల ఆంక్షల నడుమే ఆప్ నేతలు, కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేపట్టగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఆప్ సీనియర్ నేత సోమనాథ్ భారతి, ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాఖి బిర్లా, పంజాబ్ మంత్రి హర్జోత్ సింగ్ బైన్స్ తదితరులు ఉన్నారు. మరోవైపు ఆప్ ఆందోళనలకు కౌంటర్‌గా బీజేపీ కూడా ఆందోళన చేపట్టింది. కేజ్రీవాల్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఫిరోజ్‌షా కోట్ల మైదానం నుంచి ఢిల్లీ సెక్రటేరియట్ వైపుగా బీజేపీ నేతలు మార్చ్ చేశారు. ఈ క్రమంలో వారిని అడ్డుకొన్న పోలీసులు.. ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవతోపాటు 57 మంది బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకొన్నారు.

కస్టడీ నుంచి రెండో ఆదేశాలు

ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్.. రెండోసారి పాలనాపరమైన ఆదేశాలు జారీచేశారు. నగరంలోని మొహల్లా క్లినిక్స్, దవాఖానల్లో మందులు, రోగ నిర్ధారణ పరీక్షల కొరత లేకుండా చూడాలని సూచించారని ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరవ్ భరద్వాజ్ మంగళవారం వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయని వస్తున్న పుకార్లపై ఢిల్లీ ప్రభుత్వం స్పందించింది. అలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రజలెవరూ నమ్మవద్దని ప్లానింగ్ విభాగం ప్రకటన విడుదల చేసింది.

పారదర్శక విచారణ జరగాలన్న యూఎస్

కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా స్పందించింది. పారదర్శక, నిష్పక్షపాత న్యాయ ప్రక్రియ జరుగుతుందని ఆశిస్తున్నామని పేర్కొన్నది. అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రాయిటర్స్‌తో మాట్లాడుతూ కేజ్రీవాల్ అరెస్టుకు సంబంధించిన నివేదికలను పరిశీలిస్తున్నామని తెలిపారు. కేజ్రీవాల్ విషయంలో పారదర్శక, నిష్పక్షపాత, సమయానుకూల న్యాయప్రక్రియ ఉండేలా భారత్‌ను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

కేజ్రీ సవాల్ పిటిషన్‌పై నేడు విచారణ

మద్యం పాలసీ కేసులో తనను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు బుధవారం విచారణ చేయనున్నది. తన అరెస్టు, ఈడీ రిమాండ్ అక్రమమని, తనను వెంటనే విడుదల చేయాలని కేజ్రీవాల్ న్యాయస్థానానికి విన్నవించారు.

తమిళనాట సైద్ధాంతిక పోరు

- రాష్ట్రంలో మారిన ఎన్నికల ముఖచిత్రం
- ఇంతకాలం ద్రవిడ పార్టీల మధ్యే పోరు
- తొలిసారిగా భిన్న భావజాలాల నడుమ పోటీ
- రేసులోకి దూసుకొస్తున్న బీజేపీ, ఎన్‌టీకే



స్టాలిన్ | పళని స్వామి | అన్నామలై | సీమాన్

చెన్నై, మార్చి 26: తమిళ రాజకీయాలు కొత్త మలుపు తీసుకుంటున్నాయి. ఆరు దశాబ్దాలుగా ద్రవిడవాద పార్టీల మధ్యనే సాగిన రాజకీయ పోటీ ఈసారి భిన్న భావజాలాల మధ్య పోరుగా మారింది. ఇంతకాలం అయితే డీఎంకే, కాకపోతే అన్నా డీఎంకే అంటూ సాగిన తమిళనాడులో ఇప్పుడు చతుర్ముఖ పోటీ నెలకొన్నది. తమిళనాడులో పట్టు కోసం బీజేపీ, నామ్ తమిళర్ కట్చి(ఎన్‌టీకే) పార్టీలు ఈసారి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటి వరకు తమిళనాడులో పెరియార్ భావజాలంతో నడిచే ద్రవిడ పార్టీలే ప్రధానంగా రాజకీయ శక్తులుగా ఉండేవి. ఈసారి మాత్రం హిందుత్వం, జాతీయవాద భావజాలంతో బీజేపీ, తమిళ జాతీయవాదంతో ఎన్‌టీకే కూడా ప్రధాన పార్టీలుగా ఈ ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి.

మూడు భావజాలాల మధ్య పోరు

తమిళనాడులో ఎన్నడూ లేని విధంగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో మూడు భిన్న భావజాలాలతో నడిచే నాలుగు పార్టీల మధ్య పోటీ నెలకొన్నది. ఇంతకాలం ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలైనా, లోక్‌సభ ఎన్నికలైనా డీఎంకే, అన్నా డీఎంకే మధ్యనే పోటీ ఉండేది. ఇప్పటికీ డీఎంకే బలంగానే ఉన్నప్పటికీ అన్నా డీఎంకే మాత్రం జయలలిత మరణం, తదనంతర పరిణామాలు, పార్టీలో చీలికల కారణంగా కొంత బలహీనపడింది. దీంతో ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు బీజేపీ, ఎన్‌టీకే ప్రయత్నిస్తున్నాయి. ఇందులో బీజేపీ పూర్తిగా హిందూ, జాతీయవాదంతో పని చేస్తుండగా, ఎన్‌టీకే మాత్రం తమిళ జాతీయవాదాన్ని నమ్ముకున్నది. దీంతో నాలుగు పార్టీలు.. మూడు భావజాలాల మధ్య ఈసారి తమిళనాడులో ఎన్నికల పోరు జరుగుతున్నది.

కూటమి కట్టిన బీజేపీ

ఇప్పటివరకు తమిళనాడు రాజకీయాల్లో బీజేపీ పాత్ర చాలా పరిమితంగా ఉండేది. ఏదో ఒక కూటమిలో చిన్న పార్టీగా ఉంటూ వచ్చిన బీజేపీ మొదటిసారిగా తానే ఒక కూటమి కట్టి నడిపిస్తూ ప్రధాన పార్టీగా మారింది. అంబుమని రామదాస్ నాయకత్వంలోని పీఎంకే, దినకరన్ నాయకత్వంలోని ఏఎంఎంకే పార్టీలతో బీజేపీ జట్టుకట్టింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అన్నామలై నేతృత్వంలో ఈసారి ఎన్నికల్లో బీజేపీ కొంత దూకుడుగానే వెళ్తున్నది. కచ్చితంగా 25 శాతం ఓటు బ్యాంకును సాధించుకోవాలనే పట్టుదలతో ఆ పార్టీ ఉంది.

ఓటుబ్యాంకును పెంచుకునే యత్నంలో ఎన్‌టీకే

తమిళ జాతీయవాదాన్ని, వేర్పాటువాదాన్ని వినిపించే నామ్ తమిళర్ కట్చి కూడా ఈసారి బలమైన రాజకీయ శక్తిగా ఎదిగే ప్రయత్నంలో ఉంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఈ పార్టీ గెలుచుకోనప్పటికీ ఏడు శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది. ఈసారి ఒంటరిగా ఎన్నికల బరిలో నిలిచింది. తమిళ వేర్పాటువాదం వైపు ఉండే ఈ పార్టీ ఓట్ల శాతాన్ని పెంచుకునే ప్రయత్నంలో ఉంది. ముఖ్యంగా ఆ పార్టీ అధినేత సీమాన్ ఆవేశపూరిత ప్రసంగాలకు జనం బాగానే ఆకర్షితులవుతున్నారు. ఆయన సభలకు జనం భారీగా హాజరవుతున్నారు.

పంజాబ్‌లో బీజేపీ ఒంటరి పోరే!

శిరోమణి అకాలీదళ్‌తో కుదరని పొత్తు

చండీగఢ్: పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తున్నట్టు బీజేపీ మంగళవారం ప్రకటించింది. శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ)తో పొత్తు చర్చలు విఫలమైనట్టు పరోక్షంగా తెలిపింది. 13 లోక్‌సభ స్థానాలున్న పంజాబ్‌లో ఈసారి చతుర్ముఖ పోటీ నెలకొన్నది. ఏడు దశల్లో తలపెట్టిన సార్వత్రిక ఎన్నికల్లో చివరి దశ జూన్ 1న ఈ రాష్ట్రంలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. 1996 నుంచి ప్రతి ఎన్నికల్లో ఎస్ఏడీ, బీజేపీ కలిసి పోటీ చేస్తూ వచ్చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో చెరో రెండు ఎంపీ స్థానాల్ని గెలుచుకున్నాయి. మోదీ సర్కార్ తీసుకొచ్చిన వివాదాస్పద సాగు చట్టాలకు నిరసనగా, ఎన్డీయే కూటమి నుంచి శిరోమణి అకాలీదళ్ 2020 సెప్టెంబర్‌లో బయటకు వచ్చింది.

వరుణ్‌గాంధీ అడుగులు ఎటు?

- లోక్‌సభ టికెట్ ఇవ్వని బీజేపీ
- పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, మార్చి 26: గాంధీ - నెహ్రూ కుటుంబ వారసుడు, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ రాజకీయ భవిష్యత్తు గందరగోళంలో పడింది. సిట్టింగ్ ఎంపీ అయినప్పటికీ వరుణ్ గాంధీకి బీజేపీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తారని, సమాజ్‌వాదీ పార్టీలో చేరతారని రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరాలని ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ఆహ్వానం పలకడంతో వరుణ్ గాంధీ అడుగులు ఎటువైపు ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. సంజయ్ గాంధీ కుమారుడైన వరుణ్ గాంధీ మూడుసార్లు ఎంపీగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. అయితే, ఇటీవలి కాలంలో ఆయన యూపీలోని యోగి సర్కార్‌తో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై వివిధ అంశాల్లో విమర్శలు గుప్పించారు. దీంతో బీజేపీ పెద్దలు ఆయనకు టికెట్ ఇవ్వలేదు. తనకు టికెట్ ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందనే భావనతో వరుణ్ గాంధీ ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఆయనను పార్టీలోకి రమ్మని ఆహ్వానించింది. వరుణ్‌ది గాంధీ కుటుంబం కావడం వల్లనే బీజేపీ టికెట్ ఇవ్వలేదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి ఆరోపించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఆహ్వానిస్తామని, తామంతా సంతోషిస్తామని వ్యాఖ్యానించారు. కాగా, గతంలో వరుణ్ గాంధీని కాంగ్రెస్‌లోకి తీసుకునే విషయమై రాహుల్ గాంధీ భిన్నంగా స్పందించారు. వరుణ్ గాంధీని తాను కలుస్తానని, ఆలింగనం చేసుకుంటానని, అయితే ఆయన భావజాలాన్ని మాత్రం తాను అంగీకరించనని రాహుల్ స్పష్టం చేశారు.

ముందు మీ తండ్రెవరో తెలుసుకోండి!

దీదీపై బీజేపీ నేత అనుచిత వ్యాఖ్యలు

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై బీజేపీ సీనియర్ నేత అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పెద్ద దుమారం రేగింది. ఘోష్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన టీఎంసీ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మమతా బెనర్జీ బెంగాల్‌కు స్థానిక వ్యక్తే కావాలని నినాదాన్ని ఎత్తుకున్నారు. దీనికి కౌంటర్‌గా 'గోవాకు వెళ్లినప్పుడు తాను గోవా బిడ్డను అని చెప్తారు. త్రిపురలో త్రిపుర బిడ్డను అంటారు. ముందు ఆమె ఎవరి కూతురు అన్నదానిపై స్పష్టత ఇవ్వాలి' అని ఘోష్ అసభ్య పదజాలాన్ని ఉపయోగించాడు.

ఒకే కుటుంబంలో 1200 మంది ఓటర్లు

న్యూఢిల్లీ, మార్చి 26: లోక్‌సభ ఎన్నికల వేళ అస్సాంలోని సోనిట్‌పూర్ జిల్లా నేపాలి పామ్ గ్రామం ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది. కారణం ఇక్కడ ఒకే కుటుంబంలో ఏకంగా 1200 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో వారిని ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ నేతలు గ్రామానికి క్యూ కడుతున్నారు. గ్రామంలోని 300 కుటుంబాలు ఒకే వంశానికి చెందినవే. వారంతా రాన్ బహదూర్ తాపా వారసులు. ప్రస్తుతం వారి సంఖ్య 2500 ఉండగా, అందులో 1200 మంది ఓటర్లు. ఐదుగురు భార్యలున్న ఆయనకు 12 మంది కొడుకులు, 10 మంది కుమార్తెలు సంతానం. ఇప్పుడు వారి సంఖ్య 2500కు చేరింది.

మోదీపై చర్యలు తీసుకోవడానికి భయమా?

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచార సమయంలోమోదీ పాల్పడుతున్న కోడ్ ఉల్లంఘనపై తాను చేసిన ఫిర్యాదుపై ఈసీ స్పందించకపోవడంపై మాజీ ఐఏఎస్ ఈఏఎస్ శర్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. మోదీపై చర్యలు తీసుకోవడానికి ఈసీ భయపడుతున్నదా? అని ప్రశ్నించారు. ఇటీవల తమిళనాడు పర్యటన సందర్భంగా మోదీ ఓ సభలో విపక్ష ఇండియా కూటమిపై విమర్శలు చేస్తూ 'శక్తి, హిందూయిజం' అంటూ మతసంబంధమైన విషయాలను ప్రస్తావించటాన్ని ఈనెల 22న ఈసీకి రాసిన లేఖలో శర్మ ప్రస్తావించారు.

మైక్రోసాఫ్ట్ విండోస్ బాస్‌గా పవన్ దావులూరి

ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థికి కీలక పదవి

న్యూఢిల్లీ, మార్చి 26: మైక్రోసాఫ్ట్ తన విండోస్, సర్వీస్ విభాగాల అధిపతిగా భారతీయ మూలాలున్న ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి పవన్ దావులూరిని నియమించింది. ఈ విభాగానికి ఇటీవలి వరకు బాస్‌గా ఉన్న పనోస్ పనయ్ గతేడాది అమెజాన్‌లో చేరారు. దీంతో తమ కంపెనీలో మూడేండ్లుగా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న పవన్‌కు మైక్రోసాఫ్ట్ కీలక బాధ్యతలు అప్పజెప్పింది. పవన్ 1999లో మేరీల్యాండ్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేశారు. 23 ఏండ్ల క్రితం రిలయబిలిటీ కాంపోనెంట్ మేనేజర్‌గా పవన్ మైక్రోసాఫ్ట్‌లో తన కెరీర్‌ను ప్రారంభించారు.

భారత సంతతి గణితవేత్త సుబ్రమణ్యం కన్నుమూత

న్యూయార్క్: భారత సంతతికి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ టీఎన్ సుబ్రమణ్యం(76) మంగళవారం అమెరికాలోని మిషిగన్‌లో కన్నుమూశారు. అమెరికా ఆటోమొబైల్ దిగ్గజం జనరల్ మోటార్స్ కోసం ప్రారంభించిన 'రూట్ వన్ కంపెనీ' సృష్టికర్త ఈయనే. 1979లో అమెరికాకు వెళ్లిన సుబ్రమణ్యానికి భారత్, అమెరికా దేశాల్లో గొప్ప విద్యావేత్తగా పేరున్నది. ఆయన గణితశాస్త్రానికి సంబంధించి పలు నమూనాలు, సిద్ధాంతాలను రూపొందించారు. కొన్నేండ్లు ఫిలడెల్ఫియా యూనివర్సిటీలో గణిత అధ్యాపకులుగా పని చేశారు. ఆ తర్వాత ఓక్లాండ్‌కు వెళ్లి అధ్యాపక వృత్తిని కొనసాగించారు. అనంతరం ఆటోమోటిక్ మ్యానుఫాక్చరింగ్ కంపెనీ కోసం రూట్ వన్ కంపెనీని ప్రారంభించారు.

రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్మరణానంద కన్నుమూత

కోల్‌కతా: రామకృష్ణ మిషన్, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి స్మరణానంద(95) కన్నుమూశారు. వృద్ధాప్య అనారోగ్య సమస్యల కారణంగా మంగళవారం రాత్రి 8.14 గంటలకు ఆయన కన్నుమూసినట్టు రామకృష్ణ మిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. జనవరి 29న అనారోగ్యంతో ఆయన దవాఖానలో చేరారు. రామకృష్ణ మిషన్, మఠానికి ఆయన 16వ అధ్యక్షులు. 2017లో ఆయన ఈ బాధ్యతలు స్వీకరించారు.

దీక్ష విరమించిన వాంగ్‌చుక్

'లఢక్' పోరు ఆగదని వెల్లడి

న్యూఢిల్లీ: లఢక్‌కు రాష్ట్ర హోదా, గిరిజన హక్కుల పరిరక్షణ కోసం తలపెట్టిన 21 రోజుల ఆమరణ నిరాహార దీక్షను పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మంగళవారం విరమించారు. డిమాండ్ల సాధనకు తన పోరాటం ఆగదని, ఇకముందు కూడా కొనసాగుతుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. బుధవారం నుంచి మహిళా గ్రూపులు దీక్షను కొనసాగిస్తాయని ప్రకటించారు.

రవాణా నౌక ఢీ కొట్టాక పేకమేడలా కూలిపోయిన ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన

అమెరికాలో కూలిన వంతెన

- సరుకు రవాణా నౌక ఢీకొనడంతో దుర్ఘటన
- నౌకలో 22 మంది సిబ్బంది.. అంతా భారతీయులే

బాల్టిమోర్, మార్చి 26: అమెరికాలో ఘోర ప్రమాదం జరిగింది. బాల్టిమోర్‌లోని పటాప్‌స్కో నదిలో మంగళవారం తెల్లవారు జామున ఓ సరుకు రవాణా నౌక ఢీకొట్టడంతో ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన పేకమేడలా కూలిపోయింది. వంతెన పిల్లర్‌ను నౌక ఢీకొట్టడంతో వంతెన కూలిపోతున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. వంతెనను ఢీకొట్టింది సింగపూర్‌కు చెందిన సినెర్జీ మెరైన్ గ్రూప్‌నకు చెందిన 'డాలీ' అనే నౌకగా గుర్తించారు. ఇది బాల్టిమోర్ నుంచి శ్రీలంకలోని కొలంబోకు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. నౌకలో ఇద్దరు పైలెట్లు సహా 22 మంది సిబ్బంది ఉండగా అందరూ భారతీయులేనని సినెర్జీ మెరైన్ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం వీరంతా సురక్షితంగా ఉన్నారు.

నీటిలో పడిపోయిన వాహనాలు

వంతెన కూలినప్పుడు పైనుంచి ప్రయాణిస్తున్న పలు వాహనాలు నదిలో పడిపోయాయి. దాదాపు 20 మంది నీటమునిగినట్టు అధికారులు భావిస్తున్నారు. బాధితుల్లో ఇద్దరిని సహాయ సిబ్బంది వెలికితీశారని, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నదని బాల్టిమోర్ అగ్నిమాపక విభాగం తెలిపింది.

పాక్ నేవీ స్థావరంపై దాడి

తమ పనేనన్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ

కరాచీ, మార్చి 26: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని ప్రధాన నౌకాదళ వైమానిక స్థావరాల్లో ఒకదానిపై బలూచ్ మిలిటెంట్లు దాడికి దిగారు. వెంటనే అప్రమత్తమైన పాక్ సాయుధ బలగాలు ఎదురుదాడికి దిగాయి. ఈ దాడుల్లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ సంఘటన సోమవారం రాత్రి టర్బాత్‌లో జరిగింది. పీఎన్ఎన్ సిద్ధిక్ నావల్ ఎయిర్ బేస్ దగ్గర సాయుధ ఉగ్రవాద దాడిని భద్రతా దళాలు భగ్నం చేశాయని మక్రాన్ కమిషనర్ సయీద్ అహ్మద్ ఉమ్రానీ తెలిపారు.

ఆత్మాహుతి దాడిలో ఐదుగురు చైనీయుల మృతి

చైనీయులే లక్ష్యంగా పాకిస్థాన్‌లో మరోసారి ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో ఐదుగురు చైనీయులతో పాటు ఓ స్థానికుడు కూడా మృతి చెందాడు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. చైనా ఇంజినీర్లతో ఓ బస్సు ఇస్లామాబాద్ నుంచి కోహిస్థాన్‌కు వెళ్తుండగా పేలుడు పదార్థాలతో నిండి వున్న మరో వాహనం వచ్చి ఢీకొనటంతో ఈ ప్రమాదం జరిగింది.

తీరమంతా అదానీదే!

- అదానీ గ్రూప్ చేతికి ఒడిశా గోపాల్‌పూర్ పోర్ట్
- 14కు చేరిన మొత్తం పోర్టులు, టెర్మినల్స్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): భారత తీరప్రాంతంలోని ప్రధాన పోర్టులు, టెర్మినల్స్ అన్నీ అదానీ గ్రూప్ చేతుల్లోకి పోతున్నాయి. ఇప్పటికే ఈ గ్రూప్ కింద 13 పోర్టులు ఉండగా.. తాజాగా ఒడిశాలోని గోపాల్‌పూర్ పోర్టును రూ. 3,080 కోట్లతో (95 శాతం వాటా) అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. దీంతో అదానీ గ్రూప్ కింద నడిచే పోర్టుల సంఖ్య 14కు చేరింది. 2001లో గుజరాత్‌లోని ముంద్రా పోర్టును మాత్రమే నిర్వహించే అదానీ గ్రూప్.. గడిచిన పదేండ్ల వ్యవధిలోనే ఏకంగా ఏడు పోర్టులను చేజిక్కించుకొన్నది. అంతేకాదు, దేశీయంగా జరిగే మొత్తం కార్గో వ్యాపారంలో 24 శాతం వాటా అదానీ గ్రూప్‌దే. కృష్ణపట్నం, కట్టుపల్లి, తునా, దహేజ్, హజీరా, దిఘీ, మోర్ముగావో, ఎన్నూర్, వైజాగ్ టెర్మినల్, ముంద్రా, కరైకల్, గంగవరం, దామ్రా, గోపాల్‌పూర్ పోర్టులు అదానీ గ్రూప్ కిందే నడుస్తున్నాయి.

అనుమతి లేకుండానే అటల్ పెన్షన్‌కు లింక్

బ్యాంకుల అత్యుత్సాహం.. 32% సబ్‌స్క్రైబర్లు డ్రాప్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 26(నమస్తే తెలంగాణ): అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన అటల్ పెన్షన్ యోజన(ఏపీవై) పథకాన్ని బ్యాంకు ఖాతాలకు అనుసంధానం విషయంలో బ్యాంకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయి. టార్గెట్లు చేరుకోవడం కోసం సంబంధిత ఖాతాదారుల అనుమతి లేకుండా వారి ఖాతాలకు ఈ స్కీమ్‌ను లింక్ చేస్తున్నాయి. అకౌంట్ హోల్డర్ల అనుమతి పత్రం లేకుండానే, వారి ఖాతాల నుంచి డబ్బులను విత్‌డ్రా చేస్తున్న బ్యాంకులు.. వాటిని ఏపీవై పథకానికి చందాలు కడుతున్నారని ప్రభుత్వ మేధో సంస్థ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) నివేదిక పేర్కొన్నది. దీంతో 32 శాతం మంది సబ్‌స్క్రైబర్లు డ్రాపౌట్ అయ్యారని తమ అధ్యయనంలో వెల్లడైందని ఐసీఎస్ఎస్ఆర్ తెలిపింది.

ఓటీపీ మోసాలకు ఇక చెక్!

ఐఐటీ మండీ సరికొత్త సాంకేతికత



న్యూఢిల్లీ, మార్చి 26: వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) మోసాలను అరికట్టడం పెద్ద సవాలుగా మారింది. సైబర్ నేరగాళ్ల బారిన పడి ఎంతోమంది రూ.లక్షల్లో పోగొట్టుకొంటున్న కేసులు పెరుగుతున్నాయి. సాంకేతిక అంశాలు తెలిసిన టెకీలను కూడా బోల్తా కొట్టించి డబ్బులు కొట్టేస్తున్న ఘటనలు చూస్తున్నాం. ఈ మోసాలకు చెక్ పెట్టేందుకు ఐఐటీ మండి శాస్త్రవేత్తలు కొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పాస్‌వర్డ్ ఆధారిత హ్యాకింగ్ నుంచి రక్షణ కల్పించే 'అడాప్ఐడీ' టెక్నాలజీని ఐఐటీ-మండీ, ఐఐటీ-కాన్పూర్ ఆధ్వర్యంలో నెలకొల్పిన డీప్ అల్గారిథమ్స్ కంపెనీ అభివృద్ధి చేసింది. అథెంటికేషన్ కోసం రక్షణాత్మక వ్యవస్థలో భాగంగా మల్టీలేయర్ యూజర్ బయోమెట్రిక్ బేస్‌డ్ బిహేవియర్ ప్యాటర్న్స్‌ను వినియోగించనున్నట్టు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

'గట్‌లెస్ పుడీ' ఇక లేరు

పుణే, మార్చి 26: 'ది గట్‌లెస్ పుడీ'గా ప్రాచుర్యం పొందిన పుణేకు చెందిన ఫుడ్ వ్లాగర్ నటాషా దిడ్డీ కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆమె భర్త ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. చెఫ్ అయిన నటాషా ఫుడ్ వ్లాగర్‌గా రకరకాల ఆహారాలను తన ఫాలోయర్లకు పరిచయం చేసేది. కాగా, నటాషాకు పొట్ట చుట్టూ అల్సర్లు, కణితి ఉన్నందున వైద్యులు గ్యాస్ట్రెక్టమీ శాస్త్రచికిత్స చేసి ఆమె పొట్టను తొలగించారు. దీంతో ఆమె భోజనం చేసిన గంట లోపే ఆహారం బయటకు వెళ్లిపోయేది. ఇంత పెద్ద సమస్య ఉన్నప్పటికీ ఆమె చలాకీగా కనిపిస్తూ వీడియోలు చేసేవారు.

కశ్మీర్‌లో సాయుధ బలగాల చట్టం రద్దుపై కేంద్రం ఆలోచన

న్యూఢిల్లీ: వివాదాస్పద సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాలు) చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) అమలును జమ్ము కశ్మీర్‌లో రద్దు చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మంగళవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్ నుంచి కేంద్ర బలగాలను ఉపసంహరించి, ఆ రాష్ట్ర శాంతిభద్రతల్ని అక్కడి పోలీసులకు వదిలేయాలని భావిస్తున్నామన్నారు. 'అక్కడున్న కేంద్ర బలగాలను వెనక్కి రప్పించాలని భావిస్తున్నాం.' అని అన్నారు. ఏఎఫ్ఎస్‌పీఏ ద్వారా సాయుధ బలగాలకు అపరిమితమైన అధికారాలు దఖలుపడతాయి. ఎక్కడైనా, ఎప్పుడైనా సోదాలు, ఎవరినైనా అరెస్టు చేసే అధికారం ఉంటుంది. అవసరమనుకుంటే కాల్పులు జరపొచ్చు. దీంట్లో సైనిక అధికారులకు వ్యతిరేకంగా కేసు నమోదు చేయడానికి అవకాశం లేదు.

క్యాన్సర్ రోగుల కోసం హెల్ప్‌లైన్ 9355520202

- సెకండ్ ఒపీనియన్ కోరే వారి కోసం ప్రారంభించిన అంకాలజిస్టుల టీమ్
- ఉచితంగా వైద్యుల కన్సల్టేషన్

న్యూఢిల్లీ: క్యాన్సర్ రోగుల కోసం కొంత మంది అంకాలజిస్టులతో కూడిన బృందం 'సెకండ్ ఒపీనియన్' హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రారంభించింది. తమ క్యాన్సర్ సమస్యపై రెండో అభిప్రాయం కోరుకొనే రోగులు.. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య '9355520202' నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ నంబర్‌కు కాల్ చేసి క్యాన్సర్ రోగులు డైరెక్ట్‌గా నిపుణులైన అంకాలజిస్టుతో ఉచితంగా మాట్లాడొచ్చు. చికిత్సపై చర్చించేందుకు వీడియో కాల్ చేసేందుకు కూడా అవకాశం ఉన్నది. 'క్యాన్సర్ ముక్త్ భారత్ క్యాంపెయిన్'లో భాగంగా ఈ కార్యక్రమం చేపటినట్టు క్యాంపెయిన్ హెడ్ డాక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. ప్రాణాంతకమైన క్యాన్సర్ బ